# మంటలు

## ఎం. ప్రభాకర్



"ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెల్సినట్లు?! ఏ పుర్రెలో ఎప్పుడెవరికి ఎలాంటి బుద్ధి పుడుతుందో పుట్టి ఏం చేస్తుందో ఎవడికీ తెలియదు, ఆ భగవంతుడికి తప్ప!!" అని అంటుంటాడు నా స్నేహితుడు భారవి. ఎప్పటికప్పుడు ఏదైనా జరగరానిది జరిగినా, చెయ్యరానిది ఎవడైనా చేసినా.

ఊరు ఊరంతా మంచివాడు, బుద్ధిమంతుడు, పలుకెరుగని పసివాడు, చదువే తప్ప వేరే దృష్టిలేని వెర్రివాడు, అని అందరి నోళ్ళలో నానే మా లక్ష్మణమూర్తి పున్నపలంగా— పూజారి పంతులయ్య కూతుర్ని చంపేసాడంటే, నిజంగా అది వూరు వూరంతటికీ ఆశ్చర్యమే అయ్యింది.

పలుకెరుగనివా డనుకున్న ఊరి జనమంతా పలుకురాక వున్నచోట వున్నట్టుగా విన్నచోట విన్నట్టుగానే కళ్ళు, పళ్ళ బయటపెట్టి ఉండిపోయారు. 'నిజఁవా?!' అన్న ప్రశ్న, ఆశ్చర్యం స్పష్టమయ్యేటట్టు.

ఆ అచ్చెరువునుండి తేరుకున్నవాళ్ళు కాళ్ళు గాల్లో విసిరి– పూజారి పంతులయ్య ఇంటిముందు వాలారు. గుమ్మంలోనే 'స్విమ్మింగ్‌పూల్' లాంటి 'బ్లడ్‌పూల్లో' వెళ్ళకిలా పడివున్న పార్వతిని చూసే సరికి– కాళ్ళూ, చేతులూ గడగడలాడి, గుండెలో వణుకొచ్చి, పలుకురాక ఉండిపోయారు.

'నిజఁవే!'– అనుకున్న వాళ్ళు "నిజఁవే! పార్వతి చచ్చిపోవడం నిజఁమే!.... నెత్తురు మడుగులో మునిగిపోవడం నిజఁవే! అన్నీ నిజఁమే!" నని చూచినవాళ్ళు చూడనివాళ్ళకి, చూడని వాళ్ళు మరికొందరు చూడనివాళ్ళకి 'నిజఁవేనట' అని ఆ నోట.... ఆ నోట.... జారి నా చెవిలో పడితే.... "లక్ష్మణమూర్తే!.... పార్వతినే!.... చంపేయడమే!...." అని ఆశ్చర్యంలో తలమున్కలౌతూ పరుగులెత్తాను, పార్వతి ఇంటికి. నే నాశ్చర్యంనుండి తేరుకోక ముందే పార్వతిని నెత్తుటి మడుగులో చూసాను. 'నిజఁవే' పార్వతే.... చంపబడింది పార్వతే. ఇంకా ఛాతిపక్కలో చొచ్చుకొని ఉన్నచురకత్తినే చూసాను.... నిర్ధారణగా కత్తి, నెత్తురు, పార్వతి. నిజఁవే! అంతా నిజమే!

కానీ; ఛంపింది మాత్రం లక్ష్మణమూర్తి కాదు. ముమ్మాటికీ కాదు. నేను నమ్మలేను, లక్ష్మణమూర్తేనంటే. నేనే కాదు లక్ష్మణమూర్తి నెరిగినవాడెవడూ నమ్మడు. చేయగలడంటే కూడా నమ్మరు. ఎందుకంటే, సన్నగా, పొడవుగా, పల్చగా.... లేలేత తమలపాకులా ఉండే లక్ష్మణమూర్తి, పాలపళ్ళతో, తేనె కళ్ళతో– విశాలమైన పాలభాగంతో, విజ్ఞత ప్రకటించే ముఖవర్చస్సుతో.... ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో.... కళ్ళలో తేజోవంతమైన వెలుగులో.... అతి అమాయకంగా, సుతిమెత్తగా మాట్లాడే లక్ష్మణమూర్తి అచ్చంగా ఆడపిల్లలా ఉండేవాడు.

మా ఊరి నాయుడిగారి అబ్బాయి లక్ష్మణమూర్తి. మా ఊరేదైతేనేం, లక్ష్మణమూర్తి కథ మాత్రం చెరగని, మాయని ముద్ర తరతరాలకు మా ఊరి చరిత్రలో.

* * *

చిన్నప్పట్నించీ మా ఊరు వూరంతటికి లక్ష్మణమూర్తి ఉదాహరణగా నిలిచేవాడు. మా ఊరి జిల్లాపరిషత్ స్కూలుకి స్కూల్ ఫైనల్లో ఎనభై శాతం మార్కులు తెచ్చి రికార్డు సృష్టించాడు. ఆ తరువాత యింటర్మీడియట్ కోర్సులో రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించి మా జిల్లాకే

పేరు తెచ్చాడు. మొన్న మొన్నే బియస్సీ పరీక్షలు రాసొచ్చాడు.

మా ఊర్లో చదువుకున్న వాళ్ళే తక్కువ. అందులో హైస్కూలు చదువులో చివరిమెట్టు చేరేసరికి సగంమంది రాలిపోతారు. ఇక ఆ స్కూలుఫైనల్లో మొగ్గలేసేవాళ్ళు కొందరైతే, అతి కష్టంమీద కాలేజీకి చేరినవాళ్ళు ఒకరో .... ఇద్దరో. వీరిద్దరికీ లక్ష్మణమూర్తే ఆదర్శం.

ఊరి పెద్దలంతా— చదువుల విషయంలో గానీ, అల్లరి విషయంలో గానీ తమతమ పిల్లల్ని తిడుతూ, లక్ష్మణ మూర్తినే ఆదర్శంగా చూపుతారు. "లక్ష్మణ మూర్తిని చూసి నేర్చుకోండ్రా! అలాగుండాలి పిల్లలంటే! ఏమి బుద్ధి! ఏమి చదువు! పోకిరీ వెధవలు మీరూ ఉన్నారు. ఎందుకూ? ప్రతీ క్లాసూ వాడే ఫస్టు కదరా! ఒక కొంతె పనెరుగుదుర్రా! ఒక ఆటగాని, పాటగాని, తోటలంబడి పడి తిరుగుడు గాని ఎరుగుదుర్రా!! ఛి....ఛీ.... చేతగాని చవటల్లా మీరు—" అంటూ, వాళ్ళ పిల్లల్ని తిడుతూ, లక్ష్మణమూర్తిని పొగిడేవాళ్ళే గానీ, వేలెత్తి చూపేవాళ్ళే లేరు.

అటువంటి లక్ష్మణమూర్తి ఈ హత్య చేసాడంటే ఎవరు నమ్ముతారు!! హత్య జరిగినప్పుడు ఎవరూ చూళ్ళేదు. పూజారి పంతులయ్య పట్నం వెళ్ళాడట. భార్యని తీసుకొని— ఆమె ఆరోగ్యం బాగులేదని. అతని పెద్దకూతురు పురిటికొచ్చి ఇంట్లోనే ఉంది. రెండో కూతురే పార్వతి. మూడో కూతురు పంతులయ్యతో పట్నం వెళ్ళిందట.

హత్య చెయ్యడం అర్ధరాత్రో.... వేకువో.... జరిగిందట. ఇరుగుపొరుగుకి కూడా తెలియదట. ఉదయం లేచాకే అందరితో పాటే చూసారట వాళ్ళూనూ. అదీ; తెల్లవారుతూనే పోలీసులు వస్తేనే తెల్సిందనీను అందరూ అన్నారు. పార్వతి అక్కయ్య స్పృహలో లేదు. చూసిందేమోనన్న అనుమానం.

మరి; "లక్ష్మణమూర్తే హత్య చేసినట్లు ఎవరు చూసినట్లు?" అన్నది అందరికీ ప్రశ్నే అయ్యింది. "హత్యవార్త.... ఆ నోట.... ఆ నోట ప్రాకి- పోలీసుల కందిందేమో!" అన్నారు కొందరు. ఏమో! ఎవరు చెప్పారో గానీ— జిల్లా పోలీసు సూపరింటెండెంటు దగ్గర్నుంచి వాళ్ళ ఖాకీ సిబ్బంది అంతా తరలివచ్చింది. అంతా జనమే.

పోలీసుఫోటోగ్రాఫర్ వచ్చి ఫోటోలు తీసాడు పార్వతిని రకరకాల కోణాల్లో. పోస్టుమార్టంకి పంతులయ్య కుటుంబం ఒప్పుకోలేదు. "పిల్ల కత్తిపోట్లకే పోయింది చాలన్నారు. ఇంకా ఒళ్ళంతా కోతలు కొయ్యొద్దన్నారు. మా ఇంటా వంటా ఏనాడూ ఎరుగం ఇలాంటి చావులు.... పోలీసులు.... గొడవలు...." అని మొర పెట్టుకున్నారు.

శవపంచాయితీ అన్నారు. ఊరిపెద్దలు, పోలీసులు పంచాయితీ జరిపి శవం పంతులయ్య కుటుంబానికి ఒప్పచెప్పారు.

* * *

అప్పటికే లక్ష్మణమూర్తిని కస్టడీలోకి తీసుకున్నారు. హత్యచెయ్యడం ఎవరూ చూడలేదు. కానీ; హత్యచేసింది లక్ష్మణమూర్తేనట. అది లక్ష్మణమూర్తే ఒప్పుకున్నాడట. హత్యచేసి వెళ్ళి పోలీసులకి సరండరయ్యాడట. ఇది పోలీసుల కథనం.

మర్నాటికల్లా— దినపత్రికల్లో ఫోటోలతోసహా ప్రచురణైంది, లక్ష్మణమూర్తి కథ. లక్ష్మణమూర్తికి— పార్వతికి మధ్య నడిచిన ప్రేమకథ.

చట్టానికి న్యాయాన్యాయాలు అక్కర్లేదు. సత్యాసత్యాలు తెల్సుకోదు. హత్యచేసిందెవరు?— నిజంగా హంతకుడితడేనా? అనే విషయం ప్రశ్నించదు. చేసానని తనే ఒప్పుకున్నాడు. ఊరి జనంమధ్య చెప్పాడు. పోలీసులతో చెప్పాడు. కోర్టులో చెప్పాడు. తనే చంపానని.

కేసూ, కోర్టూ, వాదన, తీర్పు, అన్నీ ఐపోయాయి. అంతవరకూ తాలూకా జైల్లో ఉంచిన లక్ష్మణమూర్తిని సెంట్రల్ జైలుకి పంపేస్తారు.

ఆ రోజే ఆఖరు. మర్నాడు లక్ష్మణమూర్తి సెంట్రల్ జైలుకి వెళ్ళిపోతాడు. అందుకని ఆ రోజే కల్సాను లక్ష్మణమూర్తిని జైల్లో.

నన్ను చూస్తూనే:— "నమస్కారం మాష్టారు!" అన్నాడు, ఎప్పటిలానే నవ్వుతూ. అవే పాలపళ్ళు— అవే తేనె కళ్ళు. ముఖంలో అదే నవ్వు. ముఖం మీద ఏ భావం లేదు.

నా దగ్గర కూర్చుని పాఠాలు వల్లె వేసే లక్ష్మణమూర్తికీ, ఇప్పుడు నా ఎదుట హంతకుడిగా నిలబడ్డ లక్ష్మణమూర్తికీ ఏమీ తేడాలేదు.

హత్యలు చేయగల కౄరత్వం, రాక్షసత్వం ఆ కళ్ళలో లేదు. ఆ ముఖంలో, ఆ నవ్వులో లేదు.

నా ఆలోచనల్లో లక్ష్మణమూర్తి.... నా ఊహల్లో లక్ష్మణమూర్తి ఇలా ఈ కటకటాలమధ్య ఇరుక్కుపోవడం తలచుకుంటుంటే— గుండె పిండి, కన్నీళ్ళు చిమ్ముకొచ్చాయి.

ఎన్నో రకాల ఆలోచనలతో నా హృదయం బరువైపోయింది. కాళ్ళు నీర్సించిపోయాయి. గుండెలో నుండి గొంతులోకి దుఃఖం తన్నుకొచ్చి అలాగే నిలబడిపోయాను, జైలు కటకటాలు పట్టుకొని.

లక్ష్మణమూర్తికి ఏమేమో చెప్పాలని, లక్ష్మణమూర్తినుండి ఏవేవో తెల్సుకోవాలని, అసలు అత డెందుకొప్పుకున్నాడో తెల్సుకోవాలని, జరిగినదానికీ, పార్వతి హత్య చేయబడినందుకు అతడెంతో విచారిస్తుంటాడని, ఓదార్చాలని,



ధైర్యం చెప్పాలని, ఇంకేమేమో చెప్పాలని అనుకుంటూ అడుగు పెట్టాను. అవన్నీ మర్చిపోయాను. లక్ష్మణమూర్తిని చూసి మాటరాక ఉండిపోయాను. నా కిచ్చిన పర్మిషన్ పదినిమిషాలూ నిలబడి కన్నీటి పొరల వెనుకనుండి చూసి వచ్చాను.

*　　*　　*

హత్య జరిగిన రోజు నుండి మరో రెండురోజుల వరకు అంతా నిశ్శబ్దమే. ఊరు ఊరంతా నిశ్శబ్దం రాజ్యం చేసిందేమో ననిపించింది. ఒకరితో ఒకరు పెదవి విప్పి పలుకరించుకోలేకపోయింది. అదో వింత వాతావరణం ఏర్పడిపోయింది. అందరికీ అర్థంకాని విషయం ఒకటే 'లక్ష్మణమూర్తి హత్య చేయగలడా!!' అని. 'నిజంగా లక్ష్మణమూర్తే చేసాడా!' అని.

రెండు మూడు రోజులవరకూ అదే వాతావరణం నడిచింది.

ఆ తరువాత మా ఊరు మాట్లాడింది. చెరువుగట్టు దగ్గర మాట్లాడింది. చాకిరేవు దగ్గర మాట్లాడింది. కోమటికొట్టు దగ్గర మాట్లాడింది. పంచాయితీ చెట్టు దగ్గర ప్రతీ ఇంట్లోనూ మాట్లాడింది. హత్య చేసింది లక్ష్మణమూర్తే నంది. కాకపోతే ఎవడొప్పుకుంటాడంది. ఉత్తినే ఎవడూ ఒప్పుకోడంది.

కొందరు— 'రోజులు మారాయి'

అన్నారు. కొందరు— 'కాలానికి చేటొచ్చిందన్నారు.' సినిమాలూ, సోకులొచ్చి ఈ ప్రేమలూ గీమలూ వచ్చాయన్నారు.

ముఖ్యంగా ఆడది ఇల్లు దాటిందగ్గర్నుంచే, చదువులు మొదలెట్టటం దగ్గర్నుంచే, ఆడది ఉద్యోగాలంటూ, ఊళ్ళేలడం ప్రారంభించిన దగ్గర్నించే— ఈ చేటుకాలం వచ్చిందన్నారు. నీతీ జాతీ పోయిందన్నారు. మతంగితం పోయిందన్నారు. కులం గోత్రం పోయిందన్నారు. అవినీతి పెరిగిపోతుందన్నారు. ఈ మాటలన్నీ ముసలితర మంది.

యూత్‌కి ఫ్రీడం లేదంది యువతరం. స్వతంత్రం వచ్చి ముప్పై అయిదేళ్ళయినా స్వతంత్రతలని హరించే బుద్ధి ఇంకా దేశానికి వదల్లేదన్నారు. లక్ష్మణమూర్తి పొరపాటు చేసాడు పార్వతిని చంపి. కానీ; వాళ్ళ ప్రేమకు అడ్డు చెప్పినవాళ్ళందర్నీ చంపాల్సిందన్నారు యువతరం అంతా.

మొత్తానికి ఊరు పూరంతా ఒకటే మాట అంది. లక్ష్మణమూర్తే కక్షకట్టి చేసేడన్నారు. ఊరు పూరంతా కాదు, ఈ లోకం అంతా ఏకమై లక్ష్మణమూర్తే చేసేడంటే నేను నమ్మను. ఎప్పటికీ నమ్మలేను కూడా.

* * *

పార్వతీ లక్ష్మణమూర్తి ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. ఊరు ఊరంతటికీ విషయం నెల క్రితమే తెల్సింది. నాకీ విషయం కొన్నేళ్ళుగా తెల్సు.

అందరిలాగ లక్ష్మణమూర్తి పార్వతీ బయటపడలేదు. ఇన్నేళ్ళు కూడా. మౌనంగా ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. ఆరాధించుకున్నారు. అభిమానించుకున్నారు. ఈ యిరు హృదయాలూ మమతల పూలు ప్రేమ దారానికి గుచ్చాయి. ఇప్పుడే కాదు. చిన్నప్పట్నించి గుచ్చాయి.

వీరి హృదయాలలోని ప్రేమ తరంగాలకు ఆనకట్ట వారి సంస్కారం. పరుగులు తీసే మనోభావాలకు కళ్ళెం వారి విజ్ఞత. ఈ ఇరు హృదయాల విపులీకరణకు నా సాంగత్యం ప్రోత్సహించింది. పాఠాలకోసం నా దగ్గరికొచ్చే వీరికి నా యిల్లు సహకరించింది. నా దగ్గరకొచ్చే కొద్ది కాలమే ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకునే అవకాశం దొరికింది. ఇన్నేళ్ళు దాగిన ప్రేమ ఈనాడు బయట పడింది.

* * *

'ప్రేమకథ లేవీ పెళ్ళిదాకా వెళ్ళవు-' అని అంటుంటాడు నా స్నేహితుడు భారవి. వాడూ ప్రేమలో దెబ్బతిని ఈ పల్లెటూల్లో చాటుగా బ్రతుకుతున్నాడు. ఒక రకంగా నిర్లిప్తమైన— స్తబ్దమైన జీవితాన్ని అలవర్చుకుని.

వాడన్నట్లే ఐంది. పార్వతీ లక్ష్మణమూర్తుల ప్రేమ పెళ్ళిప్రసక్తి లేన

న్నాళ్ళు ఏ చింతా లేకుండానే సాగిపో యింది:

ఆడపిల్లలు తోటకూర కాడల్లా ఎదిగి పోతారంటారు. మరెంతవరకు నిజమో గానీ; పార్వతి మాత్రం ఎదిగింది. శారీర కంగా మానసికంగా ఎదిగింది. పార్వతి ఎదుగుదల దొడ్లో తోటకూరలాగే అందరి కళ్ళలో పడ్డది.

పదేళ్ళకే ఆడపిల్లకి తాళి కట్టించే మూర్ఖత్వం మా ఊరు వదిలేసినా, పాతి కేళ్ళదాక ఉంచే మాత్రం చూస్తూ ఊరుకోదు.

పదహారు నిండి పదిహేడు కడుగే సింది గాబోలు పార్వతి. నిండు యవ్వనం పొంగులువారుతూ వచ్చింది. కొత్త కొత్త వంపులు, క్రొంగొత్త సొగసులు సంతరించుకుని బంగారు బొమ్మలా తయారైంది పార్వతి. పసుపుపచ్చని ఛాయ. కోలముఖం. లేత చిన్న వంపులు తిరిగిన పెదవులు. పొడవుగా ముచ్చ టగా ఉండే ముక్కు. చిన్న చేపపిల్లల్లా ఉండే కళ్ళు. అందులో ఎన్నో కాంతులు. ఉండవలసిన రీతిలో ఉండి, పొందవల సిన అందాలు పొందిన శరీర భాగాలు. ఒక్కసారి చూస్తే చాలు, మనసంతా నిండిపోయే పార్వతిరూపం నా దృష్టి నుండి యింకా దూరం కాలేదు.

* * *

మా ఊరులాంటి పల్లెటూళ్లో వయ సొచ్చిన ఆడవాళ్ళకి, మగవాళ్ళకీ, వయసు మళ్ళినవాళ్ళకీ ఒకటే ఆలోచన: పెళ్ళి. పిల్లలు. తిండి. పొలం. పంట. కాస్సేపు ముచ్చట్లు. అందులో నెప్పు కబుర్లు. అంతే అంతకు మించి మరో ఆలోచనుండదు.

ప్రపంచ సమస్యలు గానీ, మన దేశపు సమస్యలు గానీ, రాజకీయాలు గానీ, నిరుద్యోగ సమస్య గానీ; తిండి గింజల సమస్య గానీ; ఏదీ పట్టదు. అటువంటి ఆలోచన్లే ఉండవు. ఉన్న ఏ కొద్దిమందో, అవే మత్తుమందుగా తీసుకొని తిరిగేవాళ్ళు. కానీ, ఎంతసేపూ తిండి, నిద్ర గురించి ఆలోచించేవాళ్ళ తోనే చికాకు.

ఏ వ్యాపకం ఉండని ఊరుఊరంతా విడ్డూరంగా చెప్పుకుంది లక్ష్మణమూర్తి పార్వతుల ప్రేమ కథ. ఊరి పొలిమేర మొదలు శివార్ల వరకూ, నలుమూలలా వీళ్ళ కథ. పంతులయ్య ముఖానే పరిహ సించడం మొదలెట్టారు. "ఆడపిల్లని కని వదిలేసాడన్నారు." "అంత ఆడపిల్లకి పెళ్ళి చెయ్యలేనివాడు పీక పిసికి చంప లేకపోయాడా?" అన్నారు. తలో రాయి విసిరి తమాషా చూద్దామన్నట్లు.

నిముషాలమీద పూజారి పంతులయ్య తన బావమరిదికి కబురు పంపాడు. మా ఊరికి పది మైళ్ళ దూరంలో ఉన్న అతడి బావమరిది దిగాడు. అతడు ఆ ఊళ్ళో పౌరోహిత్యం చేసుకుంటున్నాడు. అతని కొడుకూ పౌరోహిత్యంలో

తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఆ కుర్రాడికే పార్వతి నివ్వడానికి నిశ్చయమైపోయింది.

తండ్రి చేసే తతంగం అంతా వింది పార్వతి. నాకీ "పెళ్ళి వద్దు!" అంది. "నేను లక్ష్మణమూర్తినే చేసుకుంటా" నంది! పార్వతి లోకం తెలియని పిల్ల. అందుకే అంత అమాయకంగా అడిగింది.

చిందులు తొక్కాడు పంతులయ్య. "బాపనదానివి— ఆ కాపువాడ్ని చేసుకుంటావా! సిగ్గులేదు? నీ ఒంట్లో నెత్తురు లేదు? దానికి బాపనత్వం లేదు? కులం గానివాడ్ని అదముడ్ని అందులోకీ శూద్రుడ్ని చేసుకుంటావా? నోర్మూయ్. నాలిక చీరేస్తాను. కాలు విరిచేస్తాను. జాగ్రత్త!" అన్నాడు.

అంతటితో ఊరుకోక నాయుడిగారితో పోట్లాట కెళ్లారు. లక్ష్మణమూర్తిని పిలిచి నిలేసి దులిపేసాడు— "ఏదో చదువు చదివి గొప్పవాడివై పోయా వనుకోక" అన్నాడు. "ఎంత చదివినా, ఎంత తెల్ల తొక్క ఉన్నా మా బాపనోడికి సాటొస్తావా!" అన్నాడు. "ఇలాంటి ప్రేమలు - దోమలు అని పిచ్చివాళ్ళ వాగితే, తనూ పిచ్చెక్కి ప్రేమపిచ్చి వదలగొట్టేస్తా"నన్నాడు.

పంతులయ్య ఒక్కి అరుపులే అరిచాడు. నాయుడుగారు తొడ చరుపులు కూడా చరిచారు. "తిండికి గతిలేని వెధవ! నీ కూతుర్ని నా కొడుక్కి చేసుకుంటా ననుకున్నావా! వాడేదో పైత్యం వాగుడు వాగితే మాత్రం నా జమీందారీకి నీ కూతుర్ని రానిస్తానా! సిగ్గులేకుండా కూతుర్ని ఊరి మీద వదిలేసి, నా కొడుక్కి వలేసి పైగా నా మీదకే వస్తావా! నేలరాయించేస్తాను జాగ్రత్త! మట్టి కరిపించేస్తాను జాగ్రత్త!!" అంటూ సవాళ్ళు విసిరాడు.

ఇరుకుటుంబాలకూ మధ్య ఇంత ఘర్షణ జరిగింది. లక్ష్మణమూర్తి నా దగ్గర కూర్చొని అంతా చెప్పి బోరుమన్నాడు.

ఈ గొడవ జరిగిన తరువాత లక్ష్మణమూర్తి ఊరు వదిలి వెళ్ళిపోయాడు. ఊరిజనం చేసే పరిహాసాన్ని భరించలేకపోయాడు. కనీసం నాతో ఒక్క మాట కూడా చెప్పకుండా పిరికిగా పారిపోయాడు!

* * *

పార్వతి పెళ్ళితంతు చకచకా సాగుతున్నట్లు గ్రహించాను. పార్వతికి లక్ష్మణమూర్తితో కాకుండా మరెవరితోనో పెళ్ళం టే సహించలేకపోతున్నాను. నా మనసు కుతకుతలాడిపోతుంది. ఎలాగైనా వీళ్ళని కలపాలని పట్టుదలగా ఉంది.

చాటుమాటుగా నన్ను గురించి అనుకుంటున్న మాటలన్నీ నా చెవిన పడుతున్నాయి. నా ఇల్లు వాళ్ళకి "లవర్స్ హౌస్"గా అయిందని. క్లాసుపాఠాలతో పాటు చిన్నప్పట్నించీ వాళ్ళిద్దరికి ప్రేమ

పాఠాలూ నేర్పుతూ వచ్చేనని. అందుకే వాళ్ళంటే ప్రత్యేక అభిమానమని. అసలు దీనంతటికీ కారణం నేనన్నారు కూడా.

ఎవరేమనుకున్నా— ఎన్నినుకున్నా నేనేం పట్టించుకోలేదు. అన్నీ దులిపేసుకున్నాను. ఈ సమస్య గురించి తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించాను. నా ఆలోచన్లేవీ అనుకూలించేలా కనిపించలేదు. ఏదైనా ఆలోచన చేద్దామంటే లక్ష్మణమూర్తి లేడు.

పార్వతిని కలిసే అవకాశం ఎలానూ లేదు. ఆమెను బంధించి తలుపులు బిగించి కాపలాలు కాసారు. ఆమె తల్లి తండ్రులను ఒప్పించే ప్రయత్నం చేద్దామంటే; వాళ్ళు నన్నో భ్రష్టుడిగా, అంటరానివాడుగా చూడ్డం ప్రారంభించి వేరు చేసారు.

ఏమీ చెయ్యడానికి తోచక, ఏం జరుగుతుందో తెలియక, ఎలా సాను కూలపర్చాలో అర్థంకాక, ఆలోచన్లతో, ఆకృతితో, చింతనాచేతనా లేక నేనుంటే— ఇంతలో ఇలా జరిగేసరికి— నాకు మతిపోయింది. ఈ హత్య చేసింది తనేనని చెబుతున్నాడనేసరికి మరింత మొద్దుబారిపోయింది. ఎలా నమ్మడం? ఎందుకిలా జరిగింది? అనుకున్నదేమిటి? జరిగిందేమిటి?

* * *

అప్పుడు పార్వతీ లక్ష్మణమూర్తుల పెళ్ళెలా చెయ్యాలి? అన్నది సమస్య నాకు. ఇప్పుడు పార్వతి మరి లేదు. ఈ తలంపే గుండెలు పిండేస్తుంది. ఎంత భయంకరమైన సత్యం! పార్వతి ఇక లేదనుకోవడం!! ఆ ఊహే భయపెడుతుంది. ఆ మాటే గుండె మండిస్తుంది!

పార్వతి లేదనుకోవడం ఎంత ఆశ్చర్యంగా తోస్తుందో! లక్ష్మణమూర్తి జైలుపాలవ్వడం అంతకంటే వేయిరెట్లు ఆశ్చర్యం కలిగిస్తుంది.

పార్వతి హత్యగురించి తెలిపే ఒకే ఒక ప్రత్యక్ష సాక్షి ఆమె అక్కయ్యే అనుకున్నాం అంతాను. ఆమె ఉందట ఆ సమయంలో. కానీ, దురదృష్టం దారి కాసి కాటేసిందన్నట్లు. ఆమెకి తగిలిన షాక్ ఆమెని ఈ లోకంనుండి దూరం చేసింది. ఆ వార్త విని నిశ్చేష్టుడనైపోయేను. ఊరుఊరంతా మళ్ళీ గుప్పుమంది. "నెలలు నిండడంవల్ల నొప్పులు ప్రారంభమై, షాక్‌లోనుండగానే డెలివిరీ అయ్యేకే చనిపోయిందట— రాత్రి కావడంవల్ల హౌస్‌సర్జన్ తప్ప మరెవ్వరూ లేకపోవడంతో— అతడు, నర్సులు వెంటవెంటనే ఏ చర్యా తీసుకోలేకపోయారని— ప్రాణం పోయేకే స్పెషలిస్ట్ వచ్చేడనీ" ఎవరో చెబుతుంటే నా నెత్తిన పిడుగులు పడుతున్నట్లనిపించింది. హృదయం బరువై మనసు మూగదైపోయింది.

పార్వతి హత్య, లక్ష్మణమూర్తి జైలు

పొలవ్వడం వాళ్ళక్కయ్య మరణం, నాకూ షాకై పోయింది.

*  *  *

హఠాత్తుగా ఒక అర్ధరాత్రి నా యింటి తలుపులు కొడుతున్న శబ్దమైతే త్రుళ్ళి పడి లేచాను. లైటువేసి వాచీ చూశాను. సుమారు ఒంటిగంటన్నర ప్రాంతంలో తలుపులు తట్టేదెవరా! అని ఆశ్చర్య పోయాను.

నెమ్మదిగా తెరుస్తున్న తలుపును భళ్ళున తోసుకుని లోపలికొచ్చేరు పూజారి పంతులయ్య, ఆయాసంతో రొప్పుతూ. మంచినీళ్ళిమ్మని సైగ చేసారు. బయట మూడురోజులుగా ఏక దాటిగా వర్షం కురుస్తుంది. మనిషి పూర్తి... తడిచిపోయున్నారు. నడుమునుండి కట్టిన పంచె తప్ప వేరే ఆచ్ఛాదనం లేదు. తెల్లని శరీరం ఎర్రగా మారిపోయినట్లు కనిపిస్తుంది. కుర్చీలో కూలబడి నీళ్ళు తాగారు. ముఖం బిగుసుకుని ఉంది. ముఖంలో కాంతి కోల్పోయి పీక్కుపోయి శవచ్ఛాయలు గోచరిస్తున్నాయి. కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

ఆయనకి ఎదురుగా కుర్చీలో కూల బడ్డాను. నా బుర్రంతా మొద్దుబారి ఉందేమో! ఆయనెందుకొచ్చేడా అన్న ఆలోచనకూడా నాలో లేదు.

మౌనంగా క్షణాలు మా మధ్య దొర్లు కుంటూ పోయాయి. కొంచెం సేపు తరువాత ప్రారంభించారు.

"బాబూ వర్మా! నీకు తెలియదు కదయ్యా నా కూతుర్ని ఎవరు చంపిం దీనూ?!" ప్రశ్నించాడు. హఠాత్తుగా ప్రశ్నించిన ఆయనలోకి చూస్తూ ఉండి పోయాను.

"నేనేనయ్యా! నేనే నా కూతుర్ని చంపుకుంది నేనే!!" ఆయన గొంతులో క్షణకాలం గాద్గికం. నా గుండెలో మరు క్షణం మ్రోగింది ఫిరంగి మ్రోత. నమ్మ లేకపోయానో.... ఆయనకి మతి భ్రమణమో! నాకు తెలియదు. ఏ నిర్లి ప్తతో....ఏ స్తబ్ధతో....నన్నావరించింది. అలా చూస్తూ ఉండిపోయాను.

"ఔను నాయనా. నేనే హంతకుడ్ని ....ఈ చేతుల్తో కూతుర్ని చంపుకున్న కిరాతకుణ్ణి!" నా ముఖంలో ఏ భావం ప్రస్ఫుటం కాకపోవడంతో ఆయన వివ రిస్తున్నాడు: గొంతు నిర్లిప్తంగా, కఠి నంగా పలుకుతుంది.

"ఆ రాత్రి పట్నం నుండి తిరిగి వచ్చాను. వేకువ వరకూ మగతనిద్రలో వీధి వాకిట్లో మంచాన దొర్లాను. అప్పుడు నా చెవిన వినిపించిన శబ్దంకి తిరిగి చూశాను. లక్షణుడు పార్వతిని తీసుకు పోతున్నాడు. లేవదీసుకు పోతున్నాడు బాబు. కొన్ని తరాలుగా నా వంశంలో లేని అప్రాచ్యపు పని నా కూతురు చేస్తుంటే చూస్తూ ఊరుకుండిపోలేక పోయింది నాలో జీర్ణించుకుపోయిన సాంప్రదాయపు నెత్తురు. అడ్డుపడ్డాను.

నా కూతురు బెంగగా, భీతిగా, భయంగా నా వైపు చూస్తూ ఉండిపోయింది. లక్ష్మణుడు నా కాళ్ళకు చుట్టుకుపోయాడు. 'మమ్మల్ని విడదీయొద్దని ప్రాధేయ పడ్డాడు.' కానీ బాబూ.... నేను క్షమించ లేదు.ఎంత బ్రతిమాలినా నా గుండె కరగ లేదు. ఇక లక్ష్మణుడు మొండికేసాడు. లేచి అమాంతం పార్వతి చెయ్యిపట్టుకుని పరుగుతీయబోయాడు. నా కన్నకూతురు కూడా నా కళ్ళముందే వాడితో లేచి పోవడానికి ధైర్యంచేస్తే నా నెత్తురు సహించలేకపోయింది. శ్రీనివాసుడిమీద ఒట్టు పెట్టాను. కాలు కదిపితే చంపేస్తాను గానీ, నిన్ను కదల్నీయనని. కానీ నా కూతురు ప్రాణాల్ని కూడా తెగించేసింది. ఈ సారి వెనుదీస్తున్న లక్ష్మణుడి చెయ్యిపట్టుకొని తను పరుగు దీయబోయింది. అంతే.... నాలో రాక్షస ప్రవేశం జరిగింది. అందుబాటులో ఉన్న ఆ చురకత్తి విసిరేశాను.

"వెచ్చని నెత్తురు పొంగి పొర్లుతుంటే నాలోని మనిషికి జ్ఞానోదయమైంది. జరిగిందేమిటో తెల్సేసరికి .. లక్షణుడు కటకటాల్లో పడ్డాడు. కూతురు పోయిందన్న దిగులుకన్నా .... నేను జైలు పాలవుతానన్న బెంగ నాలో నిండి పోయింది. కానీ, లక్షణుడింత హృదయ సంస్కారుడనుకోలేదు....నా కుటుంబం నిలబెట్టడానికి తను జైలుపాలౌతాడను కోలేదు...."

పంతులయ్యగారు చెబుతున్నారు.... నా చెవుల్లోకి ఏమీ ఎక్కడం లేదు. నా చూపులు ఎదురుగా ఉన్న కిటికీ గుండా ప్రసరిస్తున్నాయి. నా గుండెలో భడబాగ్నులు బద్దలౌతున్నాయి. లావాలు పొంగుతున్నాలు. నేను కదల్లేకపోతున్నాను. ఏమి వింటున్నానో నాకు తెలియదు. అయనేం చెబుతున్నాడో నాకు తెలియదు.

కిటికీలోంచి ఊరు కనిపిస్తుంది శివార్ల వరకూ. గుడిసెలన్నీ చిన్న కొండల్లా ఉన్నాయి. తురాయిచెట్టు, చాకిరేవు, ఏటి జోరు.... అన్నీ కనిపిస్తున్నాయి।। నా గుండె నన్నే ప్రశ్నిస్తుంది. కాదు.... అవేవీ కనిపించడంలేదు. నేలనుండి నింగికెగసే మంటలు కనిపిస్తున్నాయేమిటి? ఊరు తగలబడిపోతుంది. ఇంతసేపు కనిపించిన గుడిసెలు .... మేడలు.... మిద్దెలు.... చెట్లు.... చేలు.... ఏవీ లేవు .... ఏరుకూడా తగలబడుతుందా .... ఔను తగలబడుతుంది. తరతరాల సాంప్రదాయాల, కట్టుబాట్ల.... నీచమైన అజ్ఞానపు ఆజ్యంతో తగలబడుతుంది. ఆ మంటల్లో ఏవో మానవాకారాలు దగ్ధమయిపోతున్నాయి.... ఆ మంటల్లో పార్వతీ లక్షణమూర్తులు సమిదలయ్యేరు. ఎర్రని మంటల్లో వాళ్ళు మండుతున్నారు.... అన్నీ మంటలే.... ఎర్రని మంటలు.... ఇంకా.... ఇంకా.... జ్వాలామయమై విసురుతున్నవి వేడి సెగలు. రగిలే జ్వాలల భుగభుగలు....